సాక్షి నంద్యాల

మంగళవారం • 3 • జనవరి • 2023



పల్లకీ సేవ

మహానంది: శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు సోమవారం రాత్రి పల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ఉత్సవం చేపట్టారు.



మహానందికి మహర్దశ

మహానంది క్షేత్రాభివృద్ధిలో భాగంగా త్వరలో కోనేరుల మరమ్మతులు. టీటీడీ ఆధ్వర్యంలో భక్తుల వసతి గదుల నిర్మాణం చేపట్టనున్నారు.

8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,624.39
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 74.518
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 8,694

న్యూస్‌రీల్

‘గోరుకల్లు’ నిర్వహణకు రూ.73 లక్షలు మంజూరు



మాట్లాడుతున్న ఈఈ శుభకుమార్

పాణ్యం: గోరుకల్లు జలాశయం నిర్వహణకు ప్రభుత్వం రూ.73 లక్షలు మంజూరు చేసిందని ఈఈ శుభకుమార్ తెలిపారు. ఇంజినీర్లతో కలసి సోమవారం ఆయన గోరుకల్లు జలాశయాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జలాశయం బండ్‌పై కంపచెట్లు పెరగడం, బండ్ నెర్రలివ్వడంతో మరమ్మతులు చేసేందుకు సీఈ కబీర్‌బాషా ఆదేశాల మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడంతో నిధులు మంజూరయ్యాయన్నారు. త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. ఇన్‌ఫ్రా రెగ్యులేటర్ వద్ద అదనంగా మరో రెండు గేట్లు ఏర్పాటు చేసేందుకు టెండర్ ప్రక్రియ పూర్తయినట్లు చెప్పారు. రబీ పంటలకు పూర్తి స్థాయిలో నీటిని అందిస్తామన్నారు. ఈఈ వెంట డీఈఈ రాజశేఖర్, ఇంజినీర్లు అమృత్‌రావు, శరత్‌చంద్ర, రాహుల్, దుర్వేశి శంకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

తంగడంచ ఫారం నోడల్ అధికారిగా రామకృష్ణ



జూపాడుబంగ్లా/నంద్యాల (అర్బన్): తంగడంచ ఫారం నోడల్ అధికారిగా డాక్టర్ రామకృష్ణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తంగడంచ ఫారం భూముల్లో వ్యవసాయ వ్యవసాయ పరిశోధన కేంద్రం ఏర్పాటు చేసేందుకు గాను ప్రభుత్వం తనను నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. అందుకు అవసరమైన భూమి వివరాలతో పాటు, సరిహద్దులను రెవెన్యూ, తంగడంచ ఫారం అధికారులతో సమగ్ర వివరాలు సేకరించనున్నట్లు తెలిపారు.

ఉత్సాహంతో పని చేయండి



కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ

నంద్యాల: నూతన సంవత్సరంలో ఉద్యోగులు ఉత్సాహంతో పని చేసి జిల్లాకు మంచిపేరు తీసుకు రావాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అధికారులకు సూచించారు. 2023 ఆంగ్ల నూతన సంవత్సర సందర్భాన్ని పురస్కరించుకొని సోమవారం వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో జిల్లా అధికారులతో కలసి కలెక్టర్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

రావణవాహనంపై విహరించిన మల్లన్న



రావణవాహన సేవలో పాల్గొన్న దేవస్థానం ఈఓ దంపతులు, అధికారులు

శ్రీశైలంటెంపుల్: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని సోమవారం శ్రీశైలాలయంలోని శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లకు రావణవాహన సేవ నిర్వహించారు. ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలనంతరం రావణ వాహనంపై గ్రామోత్సవం జరిపారు. కార్యక్రమంలో ఈఓ ఎస్ లవన్న దంపతులు, ఉభయ దేవాలయాలప్రధానార్చకులు వీరన్నస్వామి, మార్కండేయశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 28లోపు లైఫ్ సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాలి

కర్నూలు(అగ్రికల్చర్): పెన్షన్‌దారులైన విశ్రాంత ఉద్యోగులు జీవన్ ప్రమాణ్ పోర్టల్ ద్వారా ఫిబ్రవరి 28లోపు వార్షిక డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాలని జిల్లా ఖజానా అధికారి బి.రామచంద్రరావు తెలిపారు. డిజిటల్ ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేసేందుకు సి.క్యాంపు సెంటర్‌లోని కర్నూలు డివిజన్ సబ్ ట్రెజరీ కార్యాలయంలో సోమవారం ప్రత్యేక కౌంటరును ఆయన ప్రారంభించారు. వేలిముద్రలు పడని వారు సంబంధిత ఖజానా కార్యాలయంలో మాన్యువల్‌గా ధ్రువపత్రాలను సమర్పించాలని సూచించారు. అనారోగ్య కారణాలతో ట్రెజరీ కార్యాలయానికి రాలేకపోతే వీడియో కాల్ ద్వారా వార్షిక ప్రమాణ ప్రత్రాలను ట్రెజరీ అధికారులు ధ్రువీకరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంటు ట్రెజరీ అధికారి రఘువీర్, ఎస్‌టీవో విక్రాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తర ద్వార దర్శనం.. సర్వపాప హరణం



అహోబిల క్షేత్రంలో ఉత్తరద్వారంలో ఉభయ దేవేరులతో కొలువైన శ్రీ ప్రహ్లాదవరదుడు

జిల్లాలో వైకుంఠ ఏకాదశి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జామునుంచే భక్తులు వైష్ణవ ఆలయాలకు పోటెత్తారు. ఉత్తర ద్వారం గుండా మహావిష్ణువును దర్శించుకొని తరించారు. జిల్లాలో అహోబిలం, మద్దిలేటయ్య క్షేత్రాలతో పాటు నంద్యాల, అవుకు, బనగానపల్లె, ఆత్మకూరు, తదితర ప్రాంతాల్లోని వైష్ణవ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వైకుంఠ ఏకాదశి రోజున ఉత్తర ద్వారం ద్వారా శ్రీహరిని దర్శించుకుంటే పుణ్యం కలగడంతో పాటు సర్వపాపాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం.

అహోబిల క్షేత్రంలో ఉత్తరద్వారం వద్ద బారులుదీరిన భక్తులు



పింఛన్ కానుక రూ. 2,750 అందజేయడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గొర్విమానుపల్లె సచివాలయం వద్ద సోమవారం వృద్ధులు, వితంతువులు తదితరులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయడం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే సాధ్యమని కొనియాడారు.

– కొలిమిగుండ్ల



సంజామల మండలం రెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఎరుకలి తులశమ్మకు వితంతు పింఛన్ వస్తోంది. ఈమె కోడలు ప్రసవం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. దీంతో తులశమ్మ ఆసుపత్రిలో ఉండాల్సి వచ్చింది. వైద్య ఖర్చులకు ఆసరాగా ఉంటుందని భావించిన గ్రామ వలంటీర్ ప్రవీణ్‌కుమార్ సోమవారం ఆసుపత్రి చేరుకుని పింఛన్ అందజేశాడు.

– కోవెలకుంట్ల

ఎలాంటి రాజకీయ సిఫారస్సులకు తావు లేదు.. ఎవరికీ ముడుపులు ఇవ్వాల్సిన అవసరం లేదు.. అర్హతే ప్రామాణికంగా పింఛన్లు మంజూరవుతున్నాయి. పూర్తి పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతోంది. జిల్లాలో కొత్తగా 6,843 మందికి పింఛన్లు మంజూరయ్యాయి. కొత్తగా పింఛన్ అందుకుంటున్న లబ్ధిదారుల్లో ఆనందం నెలకొంది.

జిల్లాకు 6,843 కొత్త పింఛన్లు మంజూరు

- పెంచిన పింఛన్ రూ.250తో కలుపుకొని రూ.2,750 పంపిణీ
- జిల్లాలో ప్రతి నెల 2,19,750 పింఛన్లు పంపిణీ
- లబ్ధిదారుల్లో సర్వత్రా హర్షం



పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, తదితరులు

నూతన కానుక

నంద్యాల: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం పేదలకు మరింత భరోసా కల్పిస్తోంది. ఇప్పటికే జిల్లాలో 2,12,907 పింఛన్లు ఉండగా కొత్తగా 6,843 పింఛన్లు మంజూరయ్యాయి. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో సుమారుగా 2,12,907 మందికి వైఎస్సార్ పింఛను కానుకను ప్రభుత్వం అందజేస్తోంది. ప్రతి నెలా ఇందుకు రూ. 54,18,60,500 కేటాయిస్తుంది. అయితే వివిధ కారణాలతో పింఛన్ అందని అర్హులను గుర్తించి ఈ ఏడాది నూతనంగా 6,843 పింఛన్లతో కలిపి మొత్తం 2,19,750 పింఛన్లు అందజేస్తోంది. సామాజిక భద్రతలో భాగంగా వృద్ధాప్య, వితంతు, వికలాంగులు, చేనేత, కల్లుగీత, మత్స్య, డప్పు కళాకారులు, చర్మకారులు, హెచ్‌ఐవీ బాధితులు, ట్రాన్స్‌జెండర్, ఒంటరి మహిళ, దీర్ఘ కాలిక వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకుంటోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాజకీయాలకు అతీతంగా పింఛన్ లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారు. ఈ ప్రక్రియను సంవత్సరానికి రెండు సార్లు చేపడుతుంది. వ్యవస్థ ఏర్పడిన తర్వాత పథకాలను ప్రభుత్వం ప్రజల వద్దకే తీసుకొని వెళ్తోంది. గ్రామ వలంటీర్లు అర్హులను ఎప్పటికప్పుడు గుర్తించి సంక్షేమ పథకాల లబ్ధిని అందజేస్తున్నారు. పింఛన్ మొత్తాన్ని దశల వారీగా రూ.250 చొప్పున పెంచుతూ రూ.3వేలు చేస్తానని నాడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని వరుసగా మూడో ఏడాది అమలు చేసి చూపించారు. వైఎస్సార్ పింఛన్ కానుక పేరుతో ఇస్తున్న పింఛన్‌ను రూ.2,500 నుంచి రూ.250 పెంచి రూ.2,750ని వలంటీర్లు ఇంటింటికి వెళ్లి పంపిణీ చేస్తున్నారు.

నియోజకవర్గాల వారీగా పింఛన్ల వివరాలు...

నియోజకవర్గం	2019లో	2022లో	2023లో కొత్త పింఛన్లు
ఆళ్లగడ్డ	33,240	37,349	1,070
బనగానపల్లె	30,747	36,172	1,229
డోన్	28,226	31,416	1,037
నందికొట్కూరు	31,640	34,909	1,103
నంద్యాల	26,032	32,159	1,033
పాణ్యం	23,640	11,730	375
శ్రీశైలం	25,246	29,172	996
మొత్తం	1,98,771	2,12,907	6,843



అర్హులందరికీ న్యాయం

ప్రతి ఆరు నెలలకు ఒకసారి అనుమానం వచ్చిన పింఛన్‌దారులకు నోటీసులు ఇవ్వడం, తగిన అర్హత ఉంటే యథాతథంగా పింఛన్ ఇవ్వడం సర్వసాధారణమే. ఇందులో భాగంగా నంద్యాల జిల్లాలో 6,289 పించన్‌దారులకు నోటీసులు ఇవ్వగా వెరిఫై చేయగా. ఇందులో 5500 మందికి అర్హత ఉన్నట్లు నిర్ధారణ అయింది. వీరు యథాతథంగా పింఛన్‌లు పొందారు. నోటీసులు ఇవ్వడమంటే పింఛన్ తీసేసినట్లు కాదని జిల్లా యంత్రాంగం మొదటి నుంచి స్పష్టం చేస్తూ వచ్చింది. అయితే టీడీపీ, దాని అనుకూల మీడియా దుష్ప్రచారం చేయడం దారుణం. పోర్‌వీలర్, ఉద్యోగులు ఉన్న కుటుంబాల్లోని వారిని మాత్రం అనర్హులుగా గుర్తించారు. త్త పింఛన్‌దారులకు పాస్ పుస్తకాలు, ప్రొసీడింగ్స్, కొత్త పింఛన్ అమౌంటు రూ.2,750 ప్రకారం పంపిణీ చేయనున్నారు. మరో వైపు పింఛన్‌ల పంపిణీ ముమ్మరంగా జరుగుతోంది. పింఛన్‌దారులు ఎక్కడా ఉన్నా వారిని కలుసుకొని వలంటీర్లు పింఛన్ అందచేస్తుండటంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

పింఛన్ కానుక పెంపుపై వారోత్సవాలు

నంద్యాల(అర్బన్): వైఎస్సార్ పింఛన్ కానుక పెంపుదలపై సంబరాల కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం స్థానిక వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, డీఆర్‌ఓ పుల్లయ్య, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొని కార్యక్రమ వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా వారోత్సవాలు నిర్వహించనున్నామన్నారు.

“ అర్హుల పింఛన్లు తొలగించ లేదు



పట్టణంలోని శ్రీనివాస సెంటర్‌లోని ఓ హోటల్‌లో దినసరి వేతనానికి కూలీగా పని చేస్తున్నాను. కొన్నేళ్ల నుంచి పింఛను వస్తూ ఉండేది. నా పేరు మీద ఇల్లు ఉందని, పింఛన్ పోతుందని చెప్పారు. ఇల్లు లేదని చెప్పడంతో స్పందించిన అధికారులు మరోమారు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ఇల్లు లేదని తేల్చారు. అయినప్పటికీ నూతన సవంత్సరం పింఛన్ వస్తుందో లేదో అనే సందేహంతో ఎంతో ఆందోళన పడ్డాను. అయితే జనవరి 1వ తేదీన తెల్లవారుజామున 5 గంటలకు వలంటీరు వచ్చి పింఛను రూ.2,750 అందజేశారు. ఎంతో ఆనందంగా ఉంది.

– నాగమ్మ, నంద్యాల

“ సంతోషంగా ఉంది



కొత్త ఏడాదిలో వితంతు పింఛను మంజూరు కావడం ఆనందంగా ఉంది. జులై మాసంలో నా భర్త బక్కన్నగారి వెంకటేశ్వర్లు అనారోగ్యంతో మృతి చెందాడు. వార్డు వలంటీర్ ఇంటికి వచ్చి వితంతు పింఛనుకు దరఖాస్తు పెట్టారు. పింఛను ఇంత త్వరగా వస్తుందని ఊహించలేదు. గతంలో ఎంతో మందికి పింఛను రావాలంటే ఏళ్లు గడిచేది. ఇప్పుడు దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ వస్తోంది. వలంటీర్, సచివాలయ సెక్రటరీ అందించిన సహకారం మరువలేనిది.

– బక్కన్నగారి వెంకట సుబ్బమ్మ, 12వ వార్డు, నంద్యాల.

“ 91 శాతం పంపిణీ



జిల్లాలో 2,19,750 పింఛన్లు ఉండగా సోమవారం సాయంత్రానికి 91 శాతం పంపిణీ చేశాం. జిల్లాకు కొత్తగా 6,843 పింఛన్లు మంజూరయ్యాయి. పింఛన్ల తొలగింపు అనేది అపోహ మాత్రమే. అర్హులు, అనర్హుల జాబితాను పరిశీలన మాత్రమే చేస్తున్నాం. ప్రతి ఆరు మాసాలకు కొత్త పింఛన్ దారుల ఎంపిక కార్యక్రమం చేపడుతున్నాం. గత మూడేళ్లుగా 20,979 కొత్త పింఛన్లు మంజూరు చేశాం. పార్టీలకు అతీతంగా అర్హులైన వారందరికీ పింఛన్లు మంజూరు చేస్తున్నాం.

– శ్రీధర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ, నంద్యాల

‘నవోదయ’లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఎమ్మిగనూరురూరల్: బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని విద్యాలయ ప్రిన్సిపాల్ కె. సాగరిక సూచించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెలాఖరు వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని, ఏప్రిల్ 29వ తేదీ ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

5న హ్యాండ్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

కర్నూలు (టౌన్): బి.క్యాంపు క్రీడా మైదానంలో ఈనెల 5వ తేదీ ఉదయం 9 గంటలకు హ్యాండ్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక ఉంటుందని జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి సువర్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్ బాలుర విభాగంలో 2007, 2008, 2009 సంవత్సరంలో జన్మించిన వారు, జూనియర్ బాలుర విభాగంలో 2003, 2004, 2005 సంవత్సరంలో జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. రూ.10 ఫీజు చెల్లించి నేరుగా పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. ఎంపికైన జట్లు ఈనెల 13, 14 తేదీల్లో గన్నవరంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని పేర్కొన్నారు.

చంద్రబాబు ప్రచార పిచ్చికి అమాయకులు బలి

- వైఎస్సార్‌సీపీ జిల్లా కో ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి



హాజరైన సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు



మాట్లాడుతున్న రామసుబ్బారెడ్డి, వేదికపై ఎమ్మెల్యే ఆర్థర్, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి

నందికొట్కూరు: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడి ప్రచార పిచ్చికి అమాయకులు బలవుతున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా కో ఆర్డినేటర్, మాజీ మంత్రి రామసుబ్బారెడ్డి అన్నారు. నందికొట్కూరు పట్టణంలోని చాముండీ ఫంక్షన్ హాల్‌లో గ్రామ, వార్డు వలంటీర్లు, సచివాలయ కన్వీర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన హామీలు అమలు చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తున్నారన్నారు. టీడీపీ హయాంలో పింఛన్ల కోసం అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు పడిగాడిపులతో విసుగు చెందేవారని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇంటి వద్దనే పింఛన్లు పంపిణీ చేస్తోందన్నారు.ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి జగనన్నతోనే సాధ్యమవుతుందన్నారు. నియోజకవర్గానికి వందల కోట్ల రూపాయాలు కేటాయించి అభివృద్ధికి పెద్దపీట వేశారని గుర్తు చేశారు. కులమతాలకు, పార్టీలకు అతీతంగా లంచాలకు తావులేకుండా సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయన్నారు. శాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు చెప్పేది అబద్ధం...చేసేది అంతా మోసమని ఎద్దేవా చేశారు. అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం ప్రతి సచివాలయానికి రూ. 20 లక్షల చొప్పున మంజూరు చేసిందన్నారు. మిడుతూరు లిఫ్ట్ ఇరిగేషన్ మంజూరుకు, టౌన్ రహదారి నిర్మాణాలు చేపట్టేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ షకూర్, హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రమాదేవి, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కమిషనర్ కిషోర్, ఎంపీపీలు మురళీకృష్ణారెడ్డి, మల్లేశ్వరి, జెడ్పీటీసీ సభ్యులు దివ్య, సుధాకర్‌రెడ్డి, జగదీశ్వరరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ హుసేనయ్య, తులసిరెడ్డి, కౌన్సిలర్లు కృష్ణ, చాంద్‌బాషా పాల్గొన్నారు.

క్లస్టర్ వర్సిటీ కాలేజీల్లో నేడు స్పాట్ అడ్మిషన్లు

కర్నూలు సిటీ: క్లసర్ట్ యూనివర్సిటీ పరిధిలోని కాన్‌స్టిట్యూయట్ కాలేజీల్లో నేడు(మంగళవారం)స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిల్వర్ జూబ్లీ కాలేజీలో ఎంఏ(ఇంగ్లిష్, తెలుగు, ఎకనామిక్స్), ఎంకామ్, ఎంఎస్సీ(ఫిజిక్స్), కేవీఆర్ కాలేజీలో ఎంఏ(తెలుగు, ఇంగ్లిష్, ఎకనామిక్స్, హిస్టరీ, రూరల్ డెవలప్‌మెంట్), ఎంకామ్(ప్రొఫెషనల్), ఎంఎస్సీ(జువాలజీ, బొటనీ, కెమిస్ట్రీ, కంప్యూటర్స్), ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీలో ఎంఏ(తెలుగు, హిస్టరీ, ఇంగ్లిష్, పొలిటికల్ సైన్స్, ఎంకామ్, ఎంఎస్సీ(బొటనీ) లలో సీట్లు ఖాళీ ఉన్నాయన్నారు. ఏపీ పీజీసెట్‌లో అర్హత పొందిన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఆయా కాలేజీల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో స్పాట్ అడ్మిషన్లకు హాజరుకావాలని సూచించారు.

రేపు ఆర్‌యూలో..

రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని కాలేజీల్లో మిగిలిపోయిన పీజీ సీట్ల భర్తీ కోసం బుధవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. వర్సిటీ అకడమిక్ బిల్డింగ్‌లో ఉదయం 10 గంటల నుంచి ఈ ప్రక్రియ కొనసాగనుంది. ఏపీ పీజీసెట్–2022 ప్రవేశ పరీక్ష రాసిన వారు స్పాట్ అడ్మిషన్‌లో పాల్గొనవచ్చు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో సామగ్రి దగ్ధం

ప్యాపిలి: మండల పరిధిలోని హుసేనాపురం గ్రామంలో సోమవారం విద్యుదాఘాతంతో ఓ ఇంటిలో విలువైన సామగ్రి దగ్ధమైంది. గ్రామానికి చెందిన నారాయణ ఇంటిలో ప్రమాదవశాత్తు షార్ట్‌సర్క్యూట్ జరగటంతో పైకప్పు తీర్లు పూర్తిగా కాలిపోయాయి. ఇతర సామగ్రి సైతం కాలిపోయింది. స్థానికులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దాదాపు రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



కాంస్య పతకం సాధించిన జిల్లా హ్యాండ్‌బాల్ జట్టు

కర్నూలు (టౌన్): రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో జిల్లా పురుషుల జట్టు ప్రతిభ చాటింది. గత నెల 30 నుంచి జనవరి 1వ తేదీ వరకు గుంటూరు జిల్లా తెనాలిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి శాప్ హ్యాండ్ బాల్ పోటీల్లో జిల్లా హ్యాండ్‌బాల్ పురుషుల జట్టు మూడవ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించింది. రాష్ట్రస్థాయిలో సత్తా చాటిన జట్టు క్రీడాకారులకు జిల్లా క్రీడా ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

మహానందికి మహర్దశ

- ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే శిల్పా రూ.2 కోట్ల స్వంత నిధులు
- రూ.80 లక్షలతో త్వరలో కోనేరులకు మరమ్మతులు
- టీటీడీ ఆధ్వర్యంలో 27 గదుల నిర్మాణానికి ముహూర్తం



అందంగా ముస్తాబైన రాతి నంది విగ్రహం



రుద్రగుండం కోనేరులోని పంచలింగాల మండపం

మహానంది: భక్తుల కోర్కెలు తీర్చే మహానందీశ్వరుడి ఆలయానికి మహర్దశ వచ్చింది. శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి చొరవ, ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి పర్యవేక్షణతో మహానంది క్షేత్రం దినదినాభివృద్ధి చెందుతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని శైవక్షేత్రాల్లో ఒకటైన మహానంది క్షేత్రానికి గతంలో ఏడాదికి రూ.7 నుంచి రూ.10 కోట్ల ఆదాయం వచ్చేది. రెండేళ్ల నుంచి రూ.13 కోట్ల నుంచి రూ.16 కోట్ల వరకు వస్తోంది. ఇక ఈ ఏడాది భారీగా పెరిగింది.

కోనేరుల మరమ్మతులకు శ్రీకారం

ఆలయ పరిధిలో పెద్దకోనేరు(రుద్రగుండం)తో పాటు రెండు చిన్న కోనేరులు ఉన్నాయి. వాటి మరమ్మతులకు దేవదాయశాఖ రూ.80 లక్షలు మంజూరు చేసింది. అందులో భాగంగా సీజీఎఫ్ నుంచి రూ.40 లక్షలు, దేవస్థానం నుంచి రూ.40లక్షలు కేటాయిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. పనులకు త్వరలో భూమిపూజ చేయనున్నారు. అలాగే ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి స్వంత నిధులు రూ.2 కోట్లతో రాతి నంది విగ్రహాన్ని అభివృద్ధి చేశారు. చుట్టూ వాటర్ ఫౌంటెయిన్, గ్రీనింగ్, అధునాతనమైన లైటింగ్ అమర్చారు. వాటితో పాటు ఆలయ మాడవీధుల్లో ల్యాండ్ స్కేపింగ్ పనులు చేపడుతున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులు ఒకరోజు ఇక్కడే ఉండి పోవాలన్నంత అందంగా తీర్చిదిద్దుతున్నారు.

రూ.4.60 కోట్లతో గదుల నిర్మాణం

టీటీడీ ఆధ్వర్యంలో రూ.4.60 కోట్లతో 27 గదుల నిర్మాణానికి త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. అందులో భాగంగా నంది విగ్రహం ఎదురుగా ఉన్న వేదపాఠశాల భవనం ప్రాంగణంలో సాయిల్‌టెస్టును సేకరించారు. త్వరలోనే పనులు మొదలు పెట్టనున్నారు. వీటితో పాటు దాతలు, భక్తుల సహకారంతో వంద వసతి గృహాల నిర్మాణం చేపట్టనున్నారు. ఏపీ టూరిజం, ప్రస్తుతం ఉన్న టీటీడీ వసతి గృహాల మధ్యలో ఖాళీగా ఉన్న స్థలంలో 50 గదులు, పార్వతీపురం రస్తాలో ఉన్న దేవస్థానం స్థలంలో మరో 50 వసతి గృహాలను నిర్మాణానికి దేవదాయశాఖ ఆమోదం తెలిపింది. మహానందీశ్వర, కామేశ్వరీదేవి, గంగాసదన్‌ల పేర్లు ప్రతిపాదించి త్వరలో నిర్మాణం మొదలు పెట్టనున్నారు.

అన్నదానానికి రూ.2.30కోట్లు డిపాజిట్లు

మహానంది దేవస్థానంలో నిర్వహించే అన్నదాన పథకానికి రూ.2.30 కోట్లు డిపాజిట్లు ఉన్నాయి. గతంలో రోజుకు 150 మందికి అన్నప్రసాద వితరణ చేసేవారు. ప్రస్తుతం 200 మందికి పంపిణీ చేస్తుండగా ఆ సంఖ్యను మూడొందలకు పెంచాలని ప్రతిపాదించారు. శని, ఆది, సోమవారాల్లో ఐదు వందల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే అరిటాకుల్లో అన్నప్రసాదాలు పంపిణీ చేస్తూ భక్తుల మన్ననలు పొందుతున్నారు. భక్తుల సౌకర్యార్థం దాతల సహకారంతో రూ. 15 లక్షలు వెచ్చించి స్టెయిన్‌లెస్ స్టీల్ టేబుళ్లు, కుర్చీలు కొనుగోలు చేశారు. మరింత మంది భక్తులకు అన్నప్రసాదాలు అందాలన్న సదుద్దేశంతో రైతుల నుంచి 1,000 బస్తాల వరిధాన్యం సేకరించారు.

కార్తీకమాసంలో రూ.1.40 కోట్లు ఆదాయం

మహానందికి అన్ని విభాగాల నుంచి ఆదాయాన్ని పెంచి భక్తులకు మరిన్ని మెరుగైన సౌకర్యాలను కల్పించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. గతంలో హుండీ కానుకల లెక్కింపు జరిగితే రూ.30 లక్షల నుంచి రూ.32 లక్షలు ఆదాయం వచ్చేది. గత ఏడాది నవంబర్‌లో 49 రోజులకు నిర్వహించిన హుండీ కానుకల లెక్కింపు ద్వారా రూ.63,71,256 ఆదాయం సమకూరింది. అలాగే గత ఏడాది కార్తీక మాసంలో నెలరోజులకు రూ.96 లక్షల ఆదాయం రాగా ఈసారి రూ.1.40 కోట్ల ఆదాయం వచ్చింది. గతంలో కంటే అదనంగా రూ. 44 లక్షలు ఆదాయం పెరిగింది.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు



శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సహకారంతో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నాం. అవినీతి రహిత పాలనే ధ్యేయంగా పనిచేస్తూ భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నాం. మహానందీశ్వరస్వామి దర్శనానికి వచ్చే భక్తులు ఎక్కడా రూపాయి చెల్లించాల్సిన అవసరం లేదు. ఆలయానికి ఆదాయం పెంచడంతో పాటు భక్తుల సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నాం. దాతల సహకారంతో ఇప్పటికే మరుగుదొడ్ల మరమ్మతులు చేశాం. త్వరలో డాక్టర్ భార్గవవర్ధన్‌రెడ్డి, డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డిల సహకారంతో బస్ షెల్టర్ నిర్మించనున్నాం. జిందాల్ కంపెనీ ఆధ్వర్యంలో టాయిలెట్లు నిర్మించనున్నాం. త్వరలో వంద వసతి గృహాలను నిర్మిస్తాం. – కాపు చంద్రశేఖర్‌రెడ్డి, ఈఓ, మహానంది

నాలుగేళ్ల ఆదాయాన్ని పరిశీలిస్తే..

సంవత్సరం	ఆదాయం
2019-20	రూ. 14,15,49,645
2020-21	రూ. 8,87,03,550
2021-22	రూ.13,36,95,099
2022-23 (నవంబర్ వరకు)	రూ. 11,60,30,208

కర్నూలు మార్కెట్ యార్డు ధరలు (క్వింటాల్‌కు రూ.లలో)

పంట	కనిష్టం	గరిష్టం
వేరుశెనగ	5052	5951
ప్రొద్దుతిరుగుడు	6119	6189
ఆముదం	6009	6375
ఉల్లి	1200	1619
ఎండు మిర్చి	2899	27205
కందులు	2400	7300
మొక్కజొన్న	1760	1816
మినుములు	7479	7479

కర్నూలు మార్కెట్ యార్డు ఫోన్ నంబర్లు 08518-257204, 257661

ఆటో బోల్తా.. 8 మంది కూలీలకు గాయాలు

పాణ్యం: మండల పరిధిలోని బలపనూరు వద్ద ఆటోబోల్తా పడి ఎనిమిది మందికి గాయాలయ్యాయి. నంద్యాల నుంచి కౌలురు పరిసర ప్రాంతాలకు వ్యవసాయ కూలీలతో వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. ఆటో బలపనూరు వద్దకు వెళ్లగానే డ్రైవర్‌కు ఫీట్స్ రావడంతో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో అందులో ఉన్న ఎనిమిది మంది కూలీలకు గాయాలు కావడంతో వారికి చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసు పత్రికి తరలిం హైవే పెట్రోల్ సిబ్బంది తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య



మృతి చెందిన చిన్న

డోన్ రూరల్: పట్టణంలోని పాతపేటకు చెందిన చిన్న (50) సోమవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటిలో చీరతో ఉరి వేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి కిందకు దించి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య రాజేశ్వరమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

8న జాతీయ ఆధునిక నృత్య పోటీలు

కర్నూలు కల్చరల్: ఎస్వీ సుబ్బారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన జాతీయ స్థాయి ఆధునిక నృత్య పోటీలు నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు వీఆర్ కాలనీ మొదటి లైన్‌లో ఉన్న నైస్ కంప్యూటర్స్ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 93968 61308 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

- రీసర్వే పూర్తయిన గ్రామాల్లో భూ హక్కు పత్రాల పంపిణీ
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పి.కోటేశ్వరరావు



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ పి.కోటేశ్వరరావు

కర్నూలు(సెంట్రల్): వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు– భూ రక్ష పథకంలో భాగంగా రీసర్వే పూర్తయిన 66 గ్రామాల్లో భూ హక్కు పత్రాల పంపిణీ కొనసాగుతోందని కలెక్టర్ పి.కోటేశ్వరరావు తెలిపారు. సోమవారం కలెక్టరేట్ నుంచి వివిధ సంక్షేమ పథకాల అమలుపై అన్ని శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డితో కలసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాకు మొత్తం 35,216 భూ హక్కు పత్రాలకుగాను 32,044 చేరినట్లు చెప్పారు. వీటిని ఇప్పటికే ఆయా మండలాలకు పంపామని, మిగిలిన వాటిని కూడా రెండు, మూడు రోజుల్లో తెప్పించి పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. మరోవైపు ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెరగాలని కలెక్టర్ మండలాధికారులను ఆదేశించారు. జగనన్న గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. నిర్మాణం పూర్తయిన ఇళ్లకు వెంటనే విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని సూచించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజాప్రతినిధులు సూచించిన పనులను పకడ్బందీగా చేపట్టాలన్నారు. టెండర్ దశలో ఉన్న పనులను పురోగతిలోకి తీసుకురావాలని ఆదేశించారు. పూర్తయిన నిర్మాణాలకు సంబంధించి ఫొటోలను అప్‌లోడ్ చేయాలన్నారు. నాడు–నేడుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కాంపౌండ్‌లు, అదనపు తరగతి గదుల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. జూనియర్ కాలేజీలలో నాడు–నేడు పనులు చేపట్టామని, వాటి పురోగతిపై ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలను ప్రారంభించి ఫొటోలను అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, పీఆర్ ఎస్ఈ సుబ్రమణ్యం, సీపీఓ అప్పలకొండ, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ ఎస్.మనోజ్‌రెడ్డి పాల్గొన్నారు.

కరాటే ఫెడరేషన్ సంయుక్త కార్యదర్శిగా కోలా ప్రతాప్

కర్నూలు (టౌన్): జాతీయ కరాటే ఫెడరేషన్ సంయుక్త కార్యదర్శిగా కర్నూలు నగరానికి చెందిన కోలా ప్రతాప్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈమేరకు సోమవారం ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన జాతీయ కరాటే ఫెడరేషన్ అధ్యక్షుడు అర్షద్ అలీఖాన్ నియమాక ఉత్తర్వులు జారీ చేశారు. గత డిసెంబర్ నెల 30 తేదీన చండీఘడ్‌లో నిర్వహించిన కరాటే ఫెడరేషన్ సర్వసభ్య సమావేశంలో ఆయనను ఎన్నుకున్నట్లు తెలిపారు.

స్పందన వినతులను నిర్లక్ష్యం చేయొద్దు

- జగనన్నకు చెప్పుదాం అర్జీలపై విచారణ చేయండి
- అధికారులకు కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆదేశం



ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ కోటేశ్వరరావు, జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు

కర్నూలు(సెంట్రల్): స్పందన కార్యక్రమానికి వచ్చే అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ పి.కోటేశ్వరరావు, జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, సీపీఓ అప్పలకొండ, పలువురుజిల్లా అధికారులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి సమస్యల పరిష్కారం కోసం ప్రజలు వస్తున్నారని, జిల్లా స్థాయి అధికారులు సరైన ఎండార్స్‌మెంట్ చేస్తే ఒక్క అర్జీ కూడా రీ ఓపెన్ కాదన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా 83 మంది అర్జీలు పెట్టుకున్నారని, వాటిపై విచారణచేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రతిరోజూ మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు.

గ్రూపు–1 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

ఈనెల 8వ తేదీన నిర్వహించే గ్రూపు–1 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పి.కోటేశ్వరారావు డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావును ఆదేశించారు. జిల్లా కేంద్రంలో 29 కేంద్రాల్లో గ్రూపు–1 ప్రిలిమినరీ పరీక్ష జరుగుతుందన్నారు. ఈ పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. పరీక్షల నిర్వహణపై ఈనెల 6వతేదీన సమీక్ష సమావేశం ఉంటుందన్నారు.

పోలీసు స్పందనకు 71 ఫిర్యాదులు

కర్నూలు: స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 71 ఫిర్యాదులొచ్చాయి. వీటిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని అడిషనల్ ఎస్పీ డి. ప్రసాద్ అర్జీదారులకు హామీ ఇచ్చారు. స్పందనలో డీఎస్పీలు వెంకటాద్రి, నాగభూషణం, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించండి

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడారు. బియాండ్ ఎస్ఎల్ఏలో ఉండి, ఇప్పటివరకు ఓపెన్ చేయని మిడుతూరు, గడివేముల, ఆళ్లగడ్డ, నందికొట్కూరు తదితర 18 మండలాల తహసీల్దార్లు, ఆత్మకూరు, డోన్ ఆర్డీఓలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డీఆర్ఓ పుల్లయ్యను ఆదేశించారు. ఇళ్ల పట్టాలు, రేషన్ కార్డుల దరఖాస్తులు బియాండ్ ఎస్ఎల్ఏలో ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే గడివేముల, శిరివెళ్ల, మహానంది, ఆళ్లగడ్డ మండలాల సర్వేయర్లు బియాండ్ ఎస్ఎల్ఏలో ఉన్న దరఖాస్తులను పరిశీలించకపోవడంపై నోటీసులు జారీ చేయాలన్నారు. స్పందన సమస్యలను పరిష్కరించి సంబంధిత ఫొటోలను అప్లోడ్ చేయని అధికారులకు నోటీసులు జారీ చేయాలన్నారు. మధ్యాహ్నం నిర్వహించిన స్పందన సమావేశానికి వీడియో కాన్ఫరెన్స్‌లో గైర్హాజరైన ఎంపీడీఓలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డిని ఆదేశించారు. 255 మంది అర్జీదారులు తమ సమస్యలపై కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లకు దరఖాస్తులు సమర్పించారు.

ఆర్‌యూ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

- చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కు తరలింపు
- పరామర్శించిన వీసీ, రిజిస్ట్రార్



చికిత్స పొందుతున్న విద్యార్థి

కర్నూలు సిటీ: రాయలసీమ యూనివర్సిటీలో బీటెక్ (మెకానికల్)థర్డ్ ఇయర్ విద్యార్థి. పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తోటి విద్యార్థులు, వర్సిటీ సిబ్బంది గమనించి వెంటనే కర్నూలు పెద్దాసుపత్రికి తరలించారు. వివిధ వర్గాలు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా.. గుంతకల్లుకి చెందిన స్వామినాయక్, బీమి నాయక్ అనే దంపతులకు ఇద్దరు కూతుర్లు, ఒక కొడుకు. ఓ కూతురు చనిపోగా, మరో కూతురుకు వివాహమైంది. ఒక్కగానొక కుమారుడు సురేష్‌ను ప్రయోజకుడిని చేయాలనే ఉద్దేశంతో తల్లిదండ్రులు వ్యవసాయ పనులు చేస్తూ చదివిస్తున్నారు. అయిష్టంగానే బీటెక్‌లో చేరిన ఈ విద్యార్థికి సెకెండ్ ఇయర్‌లో అమ్మాయిలకు సంబంధించిన అంశంలో కాలేజీ ప్రిన్సిపాల్ మందలించి పేరెంట్స్ సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినా, విద్యార్థి తన ప్రవర్తన మార్చుకోకపోగా ప్రతి రోజు రాత్రి వేళల్లో ఫోన్లలో మాట్లాడుతూ కనిపించేవాడు. ఆదివారం రాత్రి కూడా కాలేజీ భవనం వద్ద మాట్లాడుతూ కనిపించడంతో హాస్టల్‌లో పని చేసే ఓ వ్యక్తి గమనించి హాస్టల్‌కు వెళ్లి చదువుకోమని సూచించాడు. అందుకు నా ఇష్టమని సమధానం చెప్పిన సదరు విద్యార్థి తర్వాత పసుపుల గ్రామానికి వెళ్లి ఫర్టిలైజర్ దుకాణంలో పురుగుల మందు తెచ్చుకున్నాడు. ఉదయం అందరూ టిఫిన్ చేసి కాలేజీకి వెళ్లేందుకు రెడీ అవుతున్న సమయంలో సురేష్ పురుగుల మందు తాగాడు. హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు గమనించి వెంటనే 108 అంబులెన్స్‌లో పెద్దాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న వర్సిటీ వీసీ ఆచార్య ఆకెపోగు ఆనందరావు, రిజిస్ట్రార్ మధుసూదన్ వర్మలతో పాటు మరి కొందరు ఆసుపత్రికి వెళ్లి విద్యార్థిని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై అక్కడి వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని డాక్టర్లను వీసీ కోరారు. కాగా విద్యార్థి ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

గూళ్యంలో కుక్కల బెడద

హాలహర్వి: కుక్కల భయంతో గూళ్యం గ్రామస్తులు వణికిపోతున్నారు. పక్షం రోజుల వ్యవధిలో ఇవి 15 మందిని గాయపరిచాయి. దీంతో వృద్ధులు, పిల్లలు, మహిళలు బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. గ్రామంలో ఏ వీధిలో చూసినా గుంపులు గుంపులుగా శునకాలు దర్శనమిస్తున్నాయి. వీటి దాడిలో గాదిలింగప్ప, ఉలిగమ్మ, లక్ష్మి, గాదయ్యతో పాటు మరో 11 మంది గాయపడ్డారు. ఉదయాన్నే పొలాలకు వెళ్లే వారిని వెంటాడి గాయపరుస్తున్నాయని, అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రైతుబజారులో ధర్మకాట



ధర్మకాట ద్వారా తూకాలను తనిఖీ చేస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు సి.క్యాంపు రైతుబజారులో వినియోగదారుల కోసం ప్రత్యేకంగా ధర్మకాట ఏర్పాటు చేశారు. తూకాలను తనిఖీ చేసుకునేందుకు దీనిని అధికారులు ఏర్పాటు చేశారు. ప్రతి రోజు 20 మంది వినియోగదారులు తూకాలను తనిఖీ చేసుకుంటున్నారని ఎస్టేటు అధికారి హరీష్‌కుమార్, హార్టికల్చర్ కన్సల్టెంటు శివకుమార్ తెలిపారు.

చంద్రబాబును అరెస్టు చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

- కలెక్టరేట్ ఎదుట వైఎస్ఆర్‌సీపీ ఆధ్వర్యంలో ధర్నా

కర్నూలు(సెంట్రల్): అమాయక ప్రజల ప్రాణాలు బలిగొంటున్న చంద్రబాబునాయుడుపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని వైఎస్ఆర్‌సీపీ కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ డిమాండ్ చేశారు. గుంటూరు, కందుకూరు సంఘటనలకు నిరసనగా సోమవారం వైఎస్ఆర్‌సీపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ముందుగా పార్టీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు వారు ర్యాలీగా వచ్చారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట బాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ.అమాయకుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న టీడీపీ నాయకుల తీరును ప్రజలు గమనించాలని కోరారు. టీడీపీ అధినేతకు డ్రోన్‌షాట్ల పిచ్చి పట్టుకుందని, అందుకోసం ప్రజల ప్రాణాలను పణంగా పెడుతున్నారన్నారు. మేయర్ బీవై రామ య్య మాట్లాడుతూ.. నెల్లూరు జిల్లా కందుకూరులో 8 మంది, గుంటూరులో చంద్రన్న కానుకల పేరిట మరికొందరి ప్రాణాలు బలిగొనడం ఎంత వరకు కరెక్టు అని ప్రశ్నించారు. ఆయన కుటుంబంలో ఇలా గే జరిగితే ఊరుకుంటారా అని నిలదీశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మ న్ సుభాష్‌చంద్రబోస్, నాయకులు సీహెచ్ మద్ద య్య, డీకే రాజశేఖర్, సుచరిత తదితరులు పాల్గొన్నారు.